తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### నెల వంక దర్శనం ...
# ఈదుల్ ఫితర్ ప్రార్థనలకు సన్నాహాలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 21 ప్రభాతవార్త : శనివారం రంజాన్ పండగ సందర్భంగా ఆచరించే 'ఈదుల్ ఫితర్' ప్రార్థనలకు సిద్ధమౌతున్నారు. ఈ నేపథ్యంలో రాజీవ్‌నగర్,ఈదుల గుంట, అయ్యలనాడు చెరువుల్లో ఉన్న ఈద్‌గాహ్‌ల వద్ద ప్రార్థనలకు ఆయా కమిటీల నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఈదుల గుంట ఈద్‌గాహ్ వద్ద భద్రత ఏర్పాట్లను టూటౌన్ సిఐ మల్లికార్జున్,ఎస్ఐ మహేష్‌లు వారిసిబ్బంది పరిశీలించారు. ఆయనకు నిర్వాహకులు ఖలీలుల్లా హుసేనీ, ఉమర్‌సాహెబ్, తాజుద్దీన్‌లు వెళ్ళి ఇక్కడ సుమారు 2నుంచి3 వేల మంది హాజరౌతారని ప్రశాంతంగా ప్రార్థనలు జరుపుకునే సమయంలో పోలీసుల బందోబస్తులు అవసరంలేదనే అభిప్రాయం వ్యక్తం చేసారు. అలాగే అయ్యలనాడు చెరువు వద్ద భద్రత ఏర్పాట్లనుకూడా పరిశీలించారు.

**నెలవంక దర్శనం కోసం నిరీక్షణ:**
శ్రీకాళహస్తిలోని మసీదుల్లో శుక్రవారం సాయంత్రం ముస్లింసోదరులు నెలవంక దర్శనం కోసం ఆకాశం వైపు పరిశీలించారు.జామియా మస్‌జిద్‌లో శ్రీకాళహస్తి ఖాజీ మున్నా సారథ్యంలో యువకులు నెలవంక కోసం చూసారు. అయితే ఆకావం మేఘావృతం కావటంతో నెలవంక దర్శనం లభించలేదు.దాంతో ముస్లిం పెద్దలు చెన్నై, నెల్లూరు, బెంగుళూరులకు కాంటాక్టు చేసారు.

**ముఫ్తీ సాహెబ్ ప్రకటన:**
బెంగుళూరులో ఏతికాఫ్ దీక్షకు వెళ్ళిన ముఫ్తీ నయిం సాహెబ్ శుక్రవారం సాయంత్రం బెంగుళూరులో నెలవంక దర్శనం లభించిందని వివరిస్తూ ఈదుల్ పితర్ జరుపుకోవచ్చునని ప్రకటించారు.దాంతో మసీదుల్లో ఈదుల్ ఫితర్ ప్రకటన చేసారు.అప్పుడే యువకులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ఎండల్లో వాన హోయ్..!
### కొండపై వడగళ్ళ వర్షంతో భక్తులు పులకింత



తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల కొండపై శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో వడగళ్ళవాన మొదలైంది. దాదాపు పదినిమిషాలుపాటు కురిసిన వర్షంతో తిరుమల వాతావరణం మారిపోయి వానకు తడిసిముద్దయ్యింది.

# సమిష్టి కృషితో ముందడుగు

- సంక్షేమం అమలులో ఎంపిడిఓల పాత్ర కీలకం
- మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు
- ఎంపిడిఓల సమీక్షా సమావేశంలలో కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: సమిష్టి కృషితో విధులు నిర్వర్తించి జిల్లాను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికా రులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుకు సంబంధించి ఎంపిడిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడం, అర్హులకు పథకా లను అందించడంతో ఎంపిడిఓల పాత్ర కీలకమన్నారు. స్పందన వినతులను నాణ్యతతో పరిష్కరించాలని, ఆర్థిక అంశాలతో సంబంధం లేని వినతులను సత్వరం పరిష్కరించాలని, గ్రామ సచివాలయాల పరిధిలో స్పందన కార్యక్రమం తప్పనిసరిగా చేపట్టేల చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులు సెలవు దినాల్లోపు పూర్తి చేయాలని, ఎండలు తీవ్రంగా వున్న నేపథ్యంలో దాతలు, స్వచ్ఛంధ సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండలాల పరిధిలో అందుబాటులో వున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకొని క్షేత్ర స్థాయిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా తగు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టడానికి హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకొని పురోగతి సాధించాలన్నారు. జిల్లాలో కోవిడ్ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ఫీవర్ సర్వేను నిర్వహించాలన్నారు. ఎక్కడైనా కేసులు నమోదు అయితే అక్కడ సత్వరం చేపట్టాల్సిన చర్యలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో జరుగుతున్న పాల సేకరణను మరింత విస్తరించాలన్నారు. ఉపాధి పథకంలో మరిన్ని పని దినాల పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ పిడి పద్మనాభం, సమగ్ర శిక్షా ఎపిసి వెంకటరమణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శంకర్‌బాబు, డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగాభవానీ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మీ, సిపిఓ ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, డిఎల్‌డిఓలు రవికుమార్, ఉమావాణి, శ్రీనివాసులు, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, ఎంపిడిఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎంపిడిఓలతో సమీక్షిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

# నేడే పిఎస్ఎల్‌వి సి-55 ప్రయోగం

- మిట్టమధ్యాహ్నం నింగికి ఎగరనున్న రాకెట్ - సందర్శకులకు ఎండ ఇబ్బందులు -చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ పూజలు



శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 21 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. నెలరోజులు తిరగకముందే ఈ సారి మరొక రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేశారు. పిఎస్ఎల్‌వి సి-55 పేరుతో నిర్మించిన ఈ రాకెట్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి అంతరిక్షానికి దూసుకెళ్లనుంది. రెండు సింగపూర్ ఉపగ్రహాలతో పాటు రాకెట్ నాలుగో దశలో ఏడు పేలోడ్లను అమర్చి ఉన్నారు. వీటిని అంతరిక్షంలోకి చేర్చడానికి అర్థగంట సమయం కూడా పట్టదు. షార్ కేంద్రం పదేపదే రాకెట్ ప్రయోగాలు జరుపుకోవడానికి మరింత ఉత్సాహంగా శాస్త్రవేత్తలు రెండుచోట్ల అనుసంధానం చేసి వడివడిగా సిద్ధం చేశారు. ఈ ప్రయోగ విజయాన్ని కాంక్షిస్తూ దేశ ప్రజలు కూడా వాణిజ్య ప్రయోజనాలు మరింత అందుబాటులోకి వస్తాయని నమ్ముతున్నారు. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో షార్‌లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీహరికోటతో పాటు సమీప ప్రాంతాల్లో ఇప్పటికే కూంబింగ్ నిర్వహించారు. షార్ నుంచి ప్రయోగిస్తున్న 57వ పిఎస్ఎల్‌వి ప్రయోగం ఇది.

**విజయం కోసం పూజలు:**
పిఎస్ఎల్‌వి సి-55 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శుక్రవారం శ్రీచెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. శ్రీహరికోట నుంచి ఆయన సూళ్లూరుపేటలోని అమ్మణ్ణి ఆలయానికి ఉదయం విచ్చేశారు. ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఇస్రో ఛైర్మన్‌ను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయం లోపల ప్రదక్షణలు చేసి పరివార దేవతలను దర్శించుకున్నారు. ఆ తర్వాత అమ్మణ్ణి గర్భగుడిలో భక్తితో మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావాలని దీవించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం బయట గోపూజలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన కొందరు భక్తులతో ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు. పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇస్రో ఛైర్మన్ వెంట ఎంఎస్‌ఏ గ్రూప్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.



చెంగాళమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న సోమనాథ్

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి

దొరవారిసత్రం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల పరిధిలోని కలగుంట బ్రిడ్జి సమీపంలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. స్థానిక పోలీసుల వివరాల మేరకు, నాయుడుపేట నుంచి వేణుంబాక వైపు మోటార్‌బైక్‌పై వస్తున్న విన్నమాల మోహన్ (32) డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. నాయుడుపేట సమీపంలోని విన్నమాలకు చెందిన దినేష్ (30) కలగుంట వద్ద డివైడర్‌ను ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న దొరవారిసత్రం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విన్నమాల మోహన్ దొరవారిసత్రం మండలంలోని వేణుంబాక గ్రామానికి చెందిన వాడు. మోహన్‌కు వివాహమై భార్య ఉంది. ఇతనికి వివాహమై రెండేళ్లు కాగా, భర్త మృతితో భార్య శిల్ప కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. విన్నమా గ్రామానికి చెందిన దినేష్ అవివాహితుడు. ఇతని మృతి సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు వర్ణనాతీతం. ఏదిఏమైనా కలగుంట సమీపంలో జాతీయ రహదారిపై గుంటలు ఉండటం ప్రమాదాలకు కారణమని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

### గడపగడపలో జడ్పీటిసి...
# స్థానికుల మధ్య వాగ్వివాదం

- ఎమ్మెల్యేతో చేయించుకోండి అన్న జడ్పీటిసి -మీరెందుకు వచ్చారన్న గ్రామస్తులు !

కుప్పంరూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : మండలంలోని నూలుకుంట గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం ఎమ్మెల్సీ భరత్ సర్దిచెప్పారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. నూలుకుంటలో గడపగడపకు కార్యక్రమానికి ఎమ్మెల్సీ భరత్‌తో పాటు జడ్పీటిసి ఎడిఎస్ శరవణ హాజరయా ్యరు. గ్రామంలో వైసిన డ్రైనేజ్ విషయంగా ఓ వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో జడ్పీటిసి మీ ఎమ్మెల్యేను అడిగి చేయించుకో అని మాట్లాడారు. దీంతో అతనితో పాటు పలువురుస్థానికులు ఎమ్మెల్యేతో మేం పనిచేయించుకుంటాం మీరెందుకు వచ్చారు అని జడ్పీటిసిని ప్రశ్నించారు. దీంతో కొంతసేపు వాగ్వివాదం జరగ్గా ఎమ్మెల్సీ భరత్, పోలీసులు గ్రామస్తులకు సర్దిచెప్పారు. ఈ సంఘటన శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.



వాగ్వివాదం జరిగిన దృశ్యం

# డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



ప్రిన్సిపాల్‌కి ప్రశంసా పత్రం అందించి అభినందిస్తున్న నాక్ బృందం

నగరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: కళాశాల ప్రగతిపై పూర్తిస్థాయి అధ్యయానికి విచ్చేసిన నేషనల్ అస్సెస్మెంట్, అక్రెడిటేషన్(నాక్) కౌన్సిల్ పీర్ టీం చైర్మన్ ఎంకె యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ శైలేష్ జలా, కో-ఆర్డినేటర్‌లు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉజ్వల్‌కెసింగ్, పోప్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అయ్యపిళ్లై సెల్వకుమార్ శుక్రవారం డిగ్రీ కళాశాలలో పర్యటించారు. గత రెండు రోజులుగా నాక్ గ్రేడింగ్‌లో పరిగణించిన 7 విభాగాలు 1 కరిక్యులం, 2 బోధనా అధ్యయనం, మూల్యాకంన, 3 పరిశోధన, కళాశాల విద్యాశాఖ, భౌతిక సౌకర్యాలు గ్రంథాలయం, 5 విద్యార్థుల ఉన్నత విద్య ప్రవేశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతిభ, ఉద్యోగాల కల్పన, 6, పరిపాలన నాయకత్వ పనితీరు, 7 ఉత్తమ పద్ధతులు క్షుణ్ణంగా పరిశీలించి రిపోర్టను సిద్ధం చేసి నాక్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. చివరిగా జరిగిన ఎగ్జిట్ మీటింగ్‌లో పీర్ టీం చైర్మన్ అహ్మదాబాద్ లోని ఎంకె భావనగర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డా. శైలేష్‌జలా మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సౌకర్యాలను ముఖ్యంగా ఎవరికైతే అత్యంత అవసరమో వారి అవసరాలు తీర్చిన కళాశాలకు నాక్ మంచి గ్రేడ్ కేటాయిస్తుందని తెలిపారు. అదే విధంగా పరిశోధనలో సంఖ్య కంటే నాణ్యత ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని, సృజనాత్మకతను పెంపొందించాలని సూచించారు. కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు, నక్షత్రవనం ద్వారా వృక్ష శాస్త్రాన్ని భారతీయ సంస్కృతితో మేళవించడం కొత్తగా ఉందని ప్రశంసించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి ఆదర్శనీయమని, ప్రిన్సిపాల్ డా. ఆర్.వేణుగోపాల్ కృషిని అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనను వారికి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు డా.అరుణకుమారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆంగ్ల విభాగం ప్రచురించిన గ్రంథాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. కళాశాల మంచి గ్రేడ్ పొందడానికి అన్ని రకాల అర్హతలు కలిగి ఉందని తెలిపారు. నాక్ ఫలితాలు 70 శాతం ఉంటుందని, పీర్ టీం 30 శాతానికి మాత్రమే ఫలితాలు నిర్ణయిస్తుం దని, కావున నాక్ సంస్థ రెండింటిని కలిపి ఈ నెల లోపు ఫలితాలను ప్రచురిస్తుందని తెలిపారు. పీర్ టీం మెంబరు కో-ఆర్డినేటర్ ప్రొఫె సర్ ఉజ్వల్ సింగ్, డా॥అయ్యపిళ్లై సెల్వకుమార్, కళాశాల మంచి గ్రేడ్ సాధించ దానికి తగిన అర్హతలు కలిగి ఉందని, ప్రస్తుతం ఉన్న కోర్సులతో పాటు మరిన్ని పీజీ కోర్సులను ప్రవేశపెట్టారని సూచించారు. ప్రిన్సి పాల్ వేణు గోపాల్ మాట్లాడుతూ నాక్ ప్రతినిధి బృందం కళాశాలకు రావడం, ప్రతి విభాగాన్ని పరిశీలించి నిర్మాణాత్మకంగా సూచనలు అందించడం కళాశాల ప్రగతికి ఎంతగానో దోహదం చేస్తుందని నాక్ టీం బృం దానికి కృతజ్ఞతలు తెలిపారు.

### యువనేత పోటీ అంటూ...
# వైసిపి శ్రేణుల్లో చర్చ!

ప్రభాతవార్త-తిరుపతి: అధికార వైసిపి రాజకీయా ల్లోకి యువతను ప్రోత్సహించే దిశగా వేస్తున్న అడుగుల్లో తిరుపతి నియోజక వర్గంలో నిత్యం ప్రజలతో మమేకమవుతూ....క్రియాశీలకంగా ఉన్న యువనేత భూమన అభినయ్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి అంటూ ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జనంతో కలసి తిరుగుతున్నారు. తమకు కాబోయే ప్రజాప్రతినిధి అభినయే నంటూ నగరంలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే తిరుపతి నగరపాలకసంస్థకు జరిగిన తొలి కౌన్సిల్ ఎన్నికల్లో అభినయ్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. తోటి కార్పొరేటర్లతో అనుబంధంగా తిరుగుతున్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు దగ్గరై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో ప్రత్యేక చొరవచూపుతున్నారు. నగరంలో రోడ్ల అభివృద్ధి, ఇతర అభివృద్ధి పనులు మొదలు కావడానికి యువనేత ఆలోచన మార్గదర్శకంగా మారిందని అధికారుల్లో బలమైన వ్యాఖ్యలు ఉన్నాయి. స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుకుంటున్న తిరుపతి నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో, ప్రజల సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో యువనేత అభినయ్‌రెడ్డి ప్రత్యేకతను చాటుకుంటున్న నాయకత్వాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో నాలుగు సంవత్సరాలలో తిరుపతి ప్రజలకు ఓ కుటుంబ సభ్యుడిగా ఉంటూ, ప్రజలకు ఏ చిన్న కష్టమొచ్చినా ఆదుకుంటూ, అభివృద్ధి పనులు చేపట్టడంలో ప్రత్యేక దృష్టి సారించారు. గతంలోనూ తెలుగుభాష పరిరక్షణ ఉత్సవాలు, తిరుపతిలో కబడ్డీపోటీలు నిర్వహణ, తిరుపతి నగరం పుట్టిన రోజు సంబరాలు వంటివి నగర ఉనికిని చాటేలా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి యువనేత అభినయ్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో పోటీచేస్తారనే పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రతి ఇంటికి వెళ్ళి సిఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రచారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో తిరుపతి నుంచి పోటీచేస్తారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీచేస్తారని పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ సమయంలో తిరుపతిలో కూడాయువనేత భూమన అభినయ్‌రెడ్డి కార్పొరేటర్‌గా ప్రజలతో మమేకమవడంలో అనుభవం గడించడంతోరానున్న ఎన్నికల్లో గెలుపు సునాయసమేనని పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. మరీ సిఎం జగన్ నుంచి అధికారికంగా ఈయన అభ్యర్థిత్వం ఖరారైతే పోటీకి సిద్ధమైనట్లే.



గడప గడప కార్యక్రమంలో భూమన అభినయ్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

### సంచలన రేపిన కేసులో...
# ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్

- గత సంవత్సరం 150 బైపాస్ ఢిల్లీస్ హోటల్ వద్ద దారిదోపిడి కేసు
- చాకచక్యంగా వలపని ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసిన ఎంఆర్‌పల్లి సిఐ
- ముద్దాయిల నుండి లక్ష ఇరవై వేల రూపాయిల నగదు స్వాధీనం

తిరుపతి క్రైం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా శుక్రవారం సుమారు ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు ఎంఆర్‌పల్లి సిఐ సురేందర్ రెడ్డికి ఖచ్చితమైన రాబడిన సమాచారం మేరకు గత సంవత్సరం 11 నెలలు 150 బైపాస్ డిల్లీస్ హోటల్ వద్ద సుమారు 16 మంది ముద్దాయిలు సినిమా పక్కలో 34 లక్షల రూపాయిలను దారిదోపిడి చేశారు. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేయగా అందులో మిగిలిన నలుగురిలో ముగ్గురిని శుక్రవారం మల్లవరం పై జంక్షన్ వద్ద ఏ3 వీరబ్రహ్మం అలియాస్ మురుగేష్ వయస్సు 30 సంవత్సరాలు రాయచోటి సుండుపల్లి ఏ4 రమేష్ అలియాస్ సాయి రెడ్డి(46) సంవత్సరాలు ఏ16 నవీన్ అలియాస్ నవీన్ కుమార్ వీరిద్దరూ కుప్పం శాంతి పురానికి చెందినవారు వీరభద్ర నుండి 1,22,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విషయాన్ని శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో సిఐ సురేందర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పి పి. పరమేశ్వర్ రెడ్డి ఐపీఎస్ వారి సూచనలు మేరకు పాత నేరస్తులపై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నేరాలు జరగకుండా చూడాలని ఇప్పటికే ఖచ్చితమైన ఆదేశాలను ఇచ్చి ఉన్నారు. వారి ఆదేశాల ప్రకారం ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు జరిగిన పలు కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి బాధితులను త్వరితగతిన న్యాయం చేయాలనే సంకల్పంతో క్రైమ్ ప్రత్యేక బృందాలు ఆహర్నిశలు శ్రమిస్తూ ఉంది. ఇందులో భాగంగా ఎంఆర్‌పల్లి సిఐకి రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరొక ముద్దాయిని కూడా త్వరలో అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సిఐ తెలిపారు. ఈ సమావేశంలో చంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25శాతం...
# ఉచిత ప్రవేశాలు కల్పించాలి

- ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి పథకాలపై అవగాహన కల్పించాలి
- స్పందన అర్జీలను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలి : కలెక్టర్



తిరుపతిరూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ప్రవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందే అని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి గురించి గ్రామ పంచాయతీలలో అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఆర్డీఓలు, కమిషనర్లు, తహశీల్దార్స్, మెడికల్ ఆఫీసర్స్, ఎంపిడిఓలు, ఎంఇఓలు, వెలుగు ఏపిఎంలు సంబంధిత అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాడు - నేడు, నవతర్నాలు, పేదలందరికి ఇళ్లు, జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం, విలేజ్ హెల్త్ క్లినిక్స్, గ్రామ వార్డు సచివాలయ వ్యవస్త పనితీరును పరిశీలించేందుకు ప్రత్యేకాధికారుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టిందని, స్పందనకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి మే మొదటి వారంలో రివ్యూ ఉంటుందని తెలిపారు. స్పందన అర్జీలను బియాండ్ ఎస్ ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్ ఆఫీసులో స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతిరోజు స్పందన వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, 24 గంటలలోపు వచ్చిన అర్జీలపై పరిశీలన ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతం పెంచాల్సిన బాధ్యత ఎంపిడి ఓలపైన ఉందన్నారు. ఎంపిడిఓలు, మునిసిఫల్ కమీషనర్లు సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డ్స్ పరిశీలన చేయాలన్నారు. జిల్లాలోని ప్రవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25శాతం 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిఆర్డిఏ పిడి జ్యోతి, డిఎల్‌డిఓ సుశీలాదేవి, డిఇఓ శేఖర్, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# బెంగుళూరులో వైభవంగా గణనాధుని కళ్యాణోత్సవం



కాణిపాకం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మరియు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బెంగుళూరు నగరంలో గణనాధుని కళ్యాణోత్సవంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి ప్రచార రథం ద్వారా హిందూ ధర్మ ప్రచారం, స్వామివారి విశిష్టతను భక్తులు తెలియజేసేందుకు వీలుగా బెంగు ళూరు నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ నందు స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిం చారు. ఈసందర్భంగా ప్రచారం రథంలో తీసుకువెళ్ళిన సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవ మూర్తులను శ్రీకన్యకాపరమేశ్వరి ట్రస్ట్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక నందు వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ అర్చకులు. వేదపండితులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

